# ఆమె తీర్పు

కో రమండల్ ఎక్స్‌ప్రెస్, లయబద్ధంగా శబ్దం చేసుకుంటూ దూసుకుపోతోంది.

అర్ధరాత్రి దాటింది. త్రీటయర్‌లోని ప్రయాణీకులందరూ అదమరచి నిద్రపోతున్నట్టే నిశ్శబ్దంగా వుంది కంపార్టుమెంటు రమకి మాత్రం నిద్రపట్టలేదు. ఆమె మెదడులో యేవేవో ఆలోచనలు చిందరవందరగా స్వైరవిహారం చేస్తున్నాయి. లేచి నిల్చుంది. బండి వేగానికి అటూ ఇటూ జోగుతోంది. టాయ్‌లెట్‌కి వెళ్ళాలనుకుంటోంది. అయితే, ఒంటరిగా వెళ్ళేందుకు భయం వేసిందామెకి. మధ్య బెర్తుమీద నిద్రపోతున్న భర్త అమరేంద్రకేసి చూసింది. అతనూ నిద్రపోలేదని మెరుస్తోన్న అతని కళ్ళు చూసి గ్రహించింది. అతనూ ఆమెకేసి చూశాడు. "ఏవిటి రమా, నిద్ర పోలేదా?" అన్నాడు లేచి కూచుంటూ.

'ఔనండీ నిద్రపట్టడం లేదు టాయ్‌లెట్‌కి వెళ్ళాలండీ" మెల్లగా అంది, రమ.

"సరేపద నేనొచ్చి అక్కడ నిల్చుంటాను" అంటూనే బెర్తుమీంచి కిందికి దిగాడు అమరేంద్ర.

అమరేంద్ర బక్కపలుచగా పొడుగ్గా వున్నాడు. అతని మొహంలో కరకుదనం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. అతని కళ్ళలో ఎర్రని జీర ప్రత్యేకంగా అగుపిస్తోంది. భార్యవెంట టాయ్‌లెట్ కేసి నడిచాడు. అమరేంద్ర. "వెళ్ళిరా రమ నేనిక్కడే వుంటాను" అన్నాడు. రమ టాయ్‌లెట్ లోపలికి వెళ్ళి తలుపు వేసుకుంది. అమరేంద్ర కంపార్టు మెంటు తలుపుని బార్లా తీశాడు ఎడమచేత్తో రాడ్డు పట్టుకుని నిల్చున్నాడు. చల్లగాలి వీస్తోంది. అతని మస్తిష్కంలో యేవేవో ఆలోచనలు పిచ్చిగా వస్తున్నాయ్.

రమ టాయ్‌లెట్‌లోంచి వచ్చేసింది. "పదండి... తలుపు యెందుకు తీశారు?" అంది అక్కడే నిల్చుని. "ఎందుకేవిటే పిచ్చి మొహమా? చూశావా తెల్లని వెన్నెల్లో ప్రకృతి యెంత అందంగా రమణీయంగా వుందో? ఇటువంటి దృశ్యం రెండు కళ్ళతో చూడాల్సిందేగాని, వర్ణించి చెప్పడం

కష్టం. నువ్వూ వచ్చి చూడు" అన్నాడు అమరేంద్ర ఆప్యాయంగా "ఈ రాత్రిపూట, యివన్నీ యెందుకండీ? పదండి హాయిగా పడుకుందాం" సమాధానమిచ్చింది రమ.

అమరేంద్ర మొహంలో నిరుత్సాహపు ఛాయలు చోటుచేసుకున్నాయి. "ఇదే నీతో వచ్చిన చిక్కు రమా!! నీ ఆనందం కోసం చెప్పినా నా మాటల్ని లెక్కచేయవు వచ్చి ఓసారి చూడు" అంటూ భార్య చేయిపట్టుకుని లాగాడు.

రమ భయంతో బెంబేలెత్తిపోయింది. కెవ్వున అరిచింది. అది ఆర్తనాదం లాంటి అ[illegible]. భర్త కపటనాటకమాడుతూ, తనని అంతమొందించడానికి ప్రయత్నిస్తున్నాడేమోనన్న అనుమానం ఆమె బుర్రలోకి రావడానికి యెక్కువసేపు పట్టలేదు. అమరేంద్ర యింకా గట్టిగా లాగుతూ వుంటే, మళ్ళీ అరిచింది. ఆమె అరుపు పక్క కేబిన్‌లో వున్న కండక్టర్‌కి వినిపించింది. చప్పున కండక్టరు వెంకటేశ్వరరావు బైటికొచ్చాడు. అతను చూసిన దృశ్యం గగుర్పాటు కలిగించింది. అమరేంద్ర రమని బైటికి నెట్టివెయ్యాలని ప్రయత్నిస్తూ వుండటం చూశాడు. అయితే ఆమె ప్రాణభయంతో రోదిస్తూ తలుపు రెక్క గట్టిగా పట్టుకుని వుండటం వల్ల అతని ప్రయత్నం ఫలించలేదు వెంకటేశ్వరరావు, ఒక్క వుదుటున వెళ్ళి రమ చేతిని పట్టుకుని లోపలికి లాగాడు నిర్ఘాంతపోయాడు అమరేంద్ర. వూహించని యీ పరిణామానికి షాక్ తిన్నాడు.

"ఏవిటి నువ్వు చేస్తున్నది?" కోపంగా అడిగాడు, అమరేంద్రని వెంకటేశ్వరరావు ధైర్యాన్ని కూడగట్టుకొని తమాయించుకున్నాడు అమరేంద్ర. "అబ్బే ఏవీ లేదండీ. వెన్నెల్లో ప్రకృతి రమణీయతని చూడమంటున్నానండీ" అన్నాడు అమరేంద్ర కాస్తంత తడబడుతూనే. రమ, యేవీ చెప్పగల స్థితిలో లేదు భయంతో యింకా వణికిపోతూనే వుంది. పరిస్థితిని అర్థం చేసుకోలేనంత అమాయకుడేంకాదు వెంకటేశ్వరరావు. వెన్నెల్లో ప్రకృతి సౌందర్యాన్ని చూడమంటున్నావా? లేక నరకం చూపించాలని ప్రయత్నించావా? రాస్కెల్..." అంటూనే ఛెళ్ళున ఓ లెంపకాయ కొట్టి అతణ్ణి లోపలికి లాగి, గేటు తలుపు వేశాడు వెంకటేశ్వరరావు.

కండక్టర్ కొట్టిన దెబ్బకి కళ్ళు తిరిగినయ్. అమరేంద్రకి.

"నామాట నమ్మండి సార్.. యేడుపు స్వరంతో అన్నాడు అమరేంద్ర. అతని కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లినయ్..." కావాలంటే రమని అడగండి సార్ ఏం రమా? రమకేసి చూస్తునే అన్నాడు.

రమ మొహం కోపంతో యెర్రబారింది మునుపటి అమాయకపు రమ కాదిప్పుడు భర్త అంతర్యమేమిటో గ్రహించేసుకుని ఆవేశంతో వున్న రమ, మౌనంగా వూరుకోవడం శ్రేయస్కరం

కాదనుకుంది.

"ఏం చెప్పమంటారండీ? ప్రకృతి రమణీయతని నాకు చూపించడానికి యీ అర్ధరాత్రే మీకు గుర్తు కొచ్చిందా? చూపాలనుకుంటే, కిటికీలోంచి చూపించొచ్చుకదా? తలుపు తీసినా రెక్క పుచ్చుకుని లాగుతూ ప్రకృతి రమణీయతను చూపించాలా? మీ అంతర్యం యేమిటో నేను గ్ర[illegible]లేదనుకోకండి. నన్ను బైటికి నెట్టాలన్న ప్రయత్నంతోనే కదా నన్నలా లాగారు? ఎంత మొ[illegible]ళ్ళండీ మీరు? నేను మీకు ధీటైన భార్యను కానని ఛీత్కారంతో నన్ను పంపించేసిన మీరు ఇన్నాళ్ళ కి వచ్చి నన్ను నమ్మించి మీతోపాటు యిప్పుడు తీసుకెళ్తున్నారు కదా! అదంతా వట్టి నాటకమన్న మాట! శాశ్వతంగా నా పీడ వదిలించుకోవడానికి అవకాశంకోసం చూసి, యిప్పుడిలా యీ ప్రయత్నం చేశారన్నమాట! నా అదృష్టం బావుంది గాబట్టి నాకేక విని కండక్టరుగారు వచ్చి నన్ను ఆదుకున్నారు. లేకపోతే నేను కిందపడి దిక్కులేని చావు చచ్చేదాన్ని కదండీ. నేనింక మీతో రాను. విజయనగరం వెళ్ళి పోతాను... కండక్టరుగారు దేవుడిలా నన్ను రక్షించారు. నన్ను మా నాన్న దగ్గరికి పంపించేయండి ఈయన్తో వెళ్తే యేదో విధంగా నన్ను హతమారుస్తారండీ ప్లీజ్ నన్ను మా నాన్న దగ్గరికి పంపించేయండి " భయంతో కంపించిపోయి రోదిస్తుంది రమ.

రమ ఆవేదన వెంకటేశ్వరరావు హృదయాన్ని కరిగించింది.

"విజయనగరంలో మీ నాన్నగారు యేం చేస్తున్నారమ్మా?" ప్రశ్నించాడు, వెంకటేశ్వరరావు.

"స్టేషను మాష్టరండీ"

" స్టేషను మాస్టరా? ఎవరు ?"

"రాఘవగారండీ" కళ్ళొత్తుకుంటూ అంది రమ.

" రాఘవగారమ్మాయివా ? ఎవరు ?"

"రాఘవగారండీ " కళ్ళొత్తుకుంటూ అంది రమ.

"రాఘవగారమ్మాయినా? నువ్వేమీ భయపడకమ్మా. నిన్ను యీ పరిస్థితిలో ఆదుకోవడం నాకర్తవ్యంగా భావిస్తున్నానమ్మా. మీ నాన్నగారు నేను మంచి స్నేహితులం పద... లోపల కూచో. నువ్వూ నడవ్వయ్యా లోపలికి" అంటూ ముందు రమ్మని తర్వాత అమరేంద్రని లోపలికి పంపించి తనూ వాళ్ళ వెంట వెళ్ళి వాళ్ళ దగ్గరే కూచున్నాడు వెంకటేశ్వరరావు.

అమరేంద్ర ఆపాదమస్తకం వణుకు పుట్టింది. స్థిమితంగా కూచోలేకపోతున్నాడు. కండక్టరు

తనని యే విధమైన కేసులో యిరికిస్తాడో నన్న భయం, పట్టుకుంది. ఈ తరుణంలో తనని రక్షించాల్సిన వ్యక్తి ఒక్క రమేనని గ్రహించాడు.

"రమా నువ్వు అకారణంగా భయపడుతున్నావు. ఏవేవో వూహిస్తున్నావు... నిజానికి..." అని యింకేదో చెప్పబోతున్న అమరేంద్ర కేసి వెంకటేశ్వరరావు తీక్షణంగా చూశాడు. "నోరు మూస్తావా లేదా? నువ్వింకేం చెప్పకు... కాస్సేపట్లో బరంపురం వస్తోంది. అక్కడ చెప్పువుగాని అర్థమయ్యిం..?" అన్నాడు వెంకటేశ్వరరావు. "నీలాంటి వాళ్ళకి యెలా బుద్ధి చెప్పడమో మాకు తెలుసు. నువ్వేంచెప్పినా నమ్మేంతటి తెలివి తక్కువ వాళ్ళం కాదు నాయనా?" అన్నాడు కోపంగానే.

అమరేంద్ర మరేం మాట్లాడలేదు. మొహం దించుకుని కూచున్నాడు. రమ అవనత ముఖియై రోదిస్తూనే వుంది. కాస్సేపట్లో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ బరంపురంలో ఆగింది.

"మీరిద్దరూ మీ సామానుతో పాటు యిక్కడ దిగండి. వూ...తొందరగా .. "అన్నాడు వెంకటేశ్వరరావు. రమ అమరేంద్రల్ని వుద్దేశించి.

ఎవరి సామాను వారు పటుకుని ఆ యిద్దరూ దిగారు. అమరేంద్రకి యెలాగైనా తప్పించుకోవాలని వుంది. కాని వెంకటేశ్వరరావు అతని వెనకనే నడుస్తూ అతనికా అవకాశాన్ని యివ్వలేదు. అంతలో ఓ రైల్లో పోలీసు కనిపించగానే, వాళ్ళిద్దర్నీ స్టేషను మాస్టారి ఆఫీసుకు తీసుకు వెళ్ళమని, అతనికి అప్పజెప్పాడు. వెఉంకటేశ్వరరావు తన ప్రయత్నానికి నీళ్ళొదులుకున్నాడు అమరేంద్ర.

వెంకటేశ్వరరావు. తన కంపార్టుమెంటు రిజర్వేషను ఛార్టుని పక్క కంపార్టుమెంటు కండక్టరుకు అప్పజెప్పి విషయం చెప్పాడు. ఆ కండక్టరు కాదనలేకపోయాడు.

రమ, అమరేంద్ర స్టేషను మాస్టరు గదిలో కూచున్నారు. వెంకటేశ్వరరావు వెళ్ళి స్టేషను మాష్టారితో విషయాన్ని వివరంగా చెప్పాడు. స్టేషను మాస్టారుకి రమ పట్ల అంతులేని సానుభూతి కలిగింది. అమరేంద్ర పట్ల ద్వేషం, ఆవేశం, ఉవ్వెత్తున వుత్పన్నమయ్యాయి. "ఇటువంటి వాణ్ణి, పోలీసులకు అప్పజెప్పేద్దామండీ వెంకటేశ్వరరావుగారూ" అన్నాడు స్టేషను మాస్టారు.

"మనం చర్య తీసుకునే ముందు, రాఘవ గారికి ఫోను మెసేజ్ పంపుదామండీ యిక్కడికే రమ్మని, ఆయన వచ్చాక యేం చెయ్యమంటే, అదే చేద్దాం సార్" తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు వెంకటేశ్వరరావు.

స్టేషను మాష్టారికి కూడా అదే మంచి పద్ధతిలా తోచింది.

"సరే అలాగే చేద్దామండీ" అంటూనే టెలిఫోను రిసీవరు అందుకుని రాఘవకి మెసేజ్ పంపించే ప్రయత్నంలో పడ్డాడు స్టేషను మాష్టారు.

వెంకటేశ్వరరావు, అమరేంద్రపై ఓ కన్నువేసే వుంచాడు.

"చూడు నాయనా ! నువ్వు చేసిన ఘనకార్యం యేమిటో నీకు తెలుసు అది హత్యా ప్రయత్నం అ[illegible]ంపై నిన్ను పోలీసులకు అప్పజెప్పడం మా కర్తవ్యం అయితే మీ మామగారి అభిప్రాయం కూడా తెలుసుకోవాలి కదా? ఆయన వచ్చాకనే నీ మీద యే చర్య తీసుకోవడమో నిర్ణయిస్తాం. ఈలోగా నువ్వు యిక్కణ్ణించి తప్పించుకుని వెళ్ళిపోవడానికి ప్రయత్నిస్తే పరిణామాలు ఘోరంగా వుంటాయి. అంచేత వొళ్ళు దగ్గర పెట్టుకుని వుండు" అన్నాడు వెంకటేశ్వరరావు అమరేంద్రని హెచ్చరిస్తూ .

అమరేంద్ర యేమీ మాట్లాడలేకపోయాడు. తాను ఇరుక్కుపోయాడన్న నిజాన్ని గ్రహించాడు. తన దురదృష్టాన్ని లోలోన తిట్టుకున్నాడు. తనకా పాడు ఆలోచన అప్పుడే ఎందుకు రావాలి? అనుకున్నాడు. తప్పుచేసిన వ్యక్తి ప్రాయశ్చిత్తం అనుభవించకుండా తప్పించుకోలేడేమోనని అప్పుడనిపించిందతనికి. అతనికి యేడుపొస్తోంది. కాని, యేడవలేకపోయాడు. అవమానం అడ్డొచ్చి మొహం దించుకున్నాడు.

రమ ఆలోచనలు వేరుగా వున్నాయి. భర్తను చూస్తుంటే జుగుప్స కలుగుతోంది. అతనితో మళ్ళీ వెళ్ళే ప్రసక్తే లేదని అప్పుడే నిర్ణయించుకుంది.

తనకి యివేవీ సంబంధం లేనట్టుగా కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఎప్పుడో ఆ స్టేషను విడిచిపెట్టింది.

టెలిఫోను మెసేజ్ ఇంట్లో అందుకున్న రాఘవ కలవరపడ్డాడు. కంగారుపడ్డాడు. ఏం జరిగిందోనని ఆ దంపతులు ఆక్రోశించారు. అయితే యేం జరిగిందో తాను వెళ్ళే వరకూ తెలీదనుకున్నాడు రాఘవ. భార్య కూడా బయల్దేరుతానంది ఆమెకి నచ్చజెప్పి ఒక్కడే బయల్దేరాడు రాఘవ. అదృష్ట వశాత్తు కోణార్క్ లేట్‌గా రావడం వల్ల ఆ బండిలో బయల్దేరాడు రాఘవ.

తెల్లవారి ఆరుగంటలకి బరంపురం చేరుకుంది, కోణార్క్ ఎక్స్‌ప్రెస్. పరుగు నడకలతో స్టేషను మాష్టరు ఆఫీసుకు చేరుకున్నాడు రాఘవ. ముందుగా వెంకటేశ్వరరావు అగుపించాడు. రూమ్ బయట పచారు చేస్తూ అతనూ రాఘవని చూశాడు. "రండి రాఘవగారూ! మీ అమ్మాయి, మీ అల్లుడు లోపల కూచున్నారు" అన్నాడు వెంకటేశ్వరరావు జరిగిన విషయాన్ని క్లుప్తంగా చెబుతూ

రాఘవ మనసు అప్పుడు కుదుటపడింది. సాధారణంగా యిటువంటి మెసేజీలు యిచ్చినప్పుడు అవి వాస్తవానికి భిన్నంగా వుండటాన్ని యెన్నోసార్లు గమనించాడు రాఘవ. అనుభవరీత్యా ! అయితే మొదట్లో కంగారుపడ్డాడు. ఇప్పుడు కుదుటపడిన హృదయంతో లోపలికి నడిచాడు రాఘవ.

తండ్రిని చూడగానే యేడుస్తూ ముందు కొచ్చింది రమ. రాఘవ సజల నేత్రాలతో కూతుర్ని హృదయానికి హత్తుకున్నాడు.

" వెంకటేశ్వరరావుగారు అంతా చెప్పారమ్మా! ఈ దుర్మార్గుడి కపటపు మాటలు నిజమని నమ్మానమ్మా ! వీడిలో మార్పు వచ్చిందని భావించి, సంసారం కుదుటపడితే చాలన్న సదుద్దేశంతో నిన్ను పంపించానమ్మా ! వీడి ఆలోచనలు యిలా వుంటాయని నాకెలా తెలుస్తుంది ? మంచి మనసుతో వీణ్ణి నమ్మడం నాదే తప్పమ్మా. మా వెంకటేశ్వరరావు, దేవుడిలా అడ్డుపడ్డాడు గాబట్టి నిన్నిలా చూడగలిగాను గాని లేకపోతే లేకపోతే" దుఃఖం వెల్లువలా వచ్చి బావురుమన్నాడు రాఘవ.

వెంకటేశ్వరరావు రాఘవ భుజం తట్టాడు అనునయపర్చే ధోరణిల్లో

"వూరుకోండి రాఘవగారూ ! దేవుడి చల్లని చూపు వల్ల యెటువంటి అఘాయిత్యం జరగలేదు. అందుకు సంతోషించండి ఇంతటి అఘాయిత్యానికి పూనుకున్న మీ అల్లుణ్ణి పోలీసులకు అప్పజెప్ప మంటారా? మీ నిర్ణయం కోసమే మీరు వచ్చే వరకూ ఆగామండీ" అన్నాడు వెంకటేశ్వరరావు.

అమరేంద్ర నిలువునా వణికిపోయాడు తనని పోలీసులకు అప్పజెప్తే వాళ్ళు దుమ్ము లేపేస్తారని అతనికి తెలుసు. ఈ పరిస్థితిలో మావగారి కాళ్ళ మీద పడ్డం ఒక్కటే శరణ్యమనుకున్నాడు. అనుకున్నదే తడవుగా మావగారి కాళ్ళమీద పడిపోయాడు అమరేంద్ర. "నన్ను నమ్మండి మావగారూ. రమకి నేను అపకారం తలపెట్టలేదు నన్ను తప్పుగా అర్థం చేసుకుంటున్నారు..." యేడుపు స్వరంతో అన్నాడు అమరేంద్ర.

స్వతహాగా రాఘవ మంచివాడు, సున్నితమనస్కుడు. అటువంటి వాడిక్కూడా కోపం వచ్చింది. రాదా మరి. అల్లుణ్ణి చొక్కాపట్టుకుని లేవనెత్తాడు. ఇంక కట్టిపెట్టరా నీ కల్లబొల్లి కబుర్లు. నీ మాటల్ని యింకా నమ్ముతాననుకున్నావా ? నీ మొహం చూడ్డానికే అసహ్యమేస్తోంది. హ్మా యెంత ధైర్యంరా నీకు ? రమ నీకు భార్యగా అవసరం లేకపోతే నిజం చెప్పి ఏడువు. అంతే గాని ఆమెని అంతమొదించడానికి ప్రయత్నిస్తావా? హత్యాయత్నం హత్యతో సమానం తెలుసా ? నీ మట్టి బుర్రకి యేం తెలుస్తుందిలే కటకటాల వెనక్కి వెళ్తే అప్పుడు తెలుస్తుంది. ఇప్పుడు నీ మీద యే చర్య తీసుకోవడమో నేను నిర్ణయించను. అమ్మాయి నిర్ణయానికే వదిలేస్తున్నాను" అంటూ రమకేసి

తిరిగి నువ్వు చెప్పమ్మా రమా. యేం శిక్ష విధించమంటావు ? పోలీసులకు అప్పజెప్పేద్దామా ' అన్నాడు రాఘవ.

రమ భర్తకేసి అసహ్యంగా, ఆవేశంతో చూసింది. భార్య సమక్షంలో అమరేంద్ర పూర్తిగా దిగజారిపోయాడు. ఆమె చూపులే చెబుతున్నాయి. "పోలీసులకి అప్పజెప్పొద్దు నాన్న ! అలా చేస్తే, అతనితో పాటు మనమూ కోర్టులకి తిరుగుతూ వుండాలి. మనకి ఇంకెందుకాశ్రమ? ఈ క్షణం నుండి నేను అతనికి భార్యను కాను. అతనితో కాపురానికి వెళ్ళే ప్రసక్తే లేదు. అందుచేత అతను తప్పు చేసినట్టు ఒప్పుకుని, పశ్చాత్తాపంతో క్షమాపణ రాత మూలంగా చెప్పుకోమనండి. భవిష్యత్తులో, అతనికీ నాకూ యెటువంటి సంబంధమూ వుండదు. ఇటువంటి వ్యక్తి నా 'భర్త అని చెప్పుకోవడానికే సిగ్గేస్తుంది నాన్నా. అతని దగ్గర రాసి తీసుకుని, పొమ్మనండి' అంది యేహ్యాభావంతో, రమ.

తాను యిరకాటంలో పడినట్టు భావించాడు, అమరేంద్ర. తన తప్పు ఒప్పుకుని, క్షమాపణ రాసి యివ్వక తప్పదనుకున్నాడు. లేకపోతే తనని పోలీసులకు అప్పజెప్తే, వుద్యోగానికే ముప్పు వస్తుంద నుకున్నాడు. మామగారి వేపు చూశాడు. అమాయకంగా.

"విన్నావా అమరేంద్రా తనని అంతమొందించడానికి నువ్వు ప్రయత్నించినా, నీ మీద కక్ష సాధించాలన్న ఉద్దేశమే లేదు రమకి. అమ్మాయిది, పెద్ద మనసు. అది నువ్వు అర్థం చేసుకోలేక, తళుకులకు, బెళుకులకే ప్రాధాన్యత నిచ్చిన నిన్ను నువ్వే వంచించుకున్నావు. అందుకు నువ్వే సిగ్గుపడాలి. వెంకటేశ్వరరావు గారు మరో చిన్న సహాయం చేసి పెట్టండి. అతడు చేసిన తప్పుకి పశ్చాత్తాప పడుతూ, క్షమాపణ కోరుతున్నట్లు ఓ కాగితం మీ్మద రాసి, అతడి సంతకం తీసుకోండి. సాక్షులుగా మీరు, మేష్టారుగారు సంతకాలు పెట్టండి" అన్నాడు రాఘవ.

"అలాగేనండీ" అంటూ తన బేగ్‌లోంచి ఓ తెల్లకాగితం తీసి అమరేంద్ర చేసిన తప్పేమిటో రాసి, క్షమాపణ కోరుకుంటున్నట్లు వివరించి ఆ కాగితాన్ని అమరేంద్ర ముందుంచాడు, వెంకటేశ్వరూవు.

"అక్కడ సంతకం పెట్టు" అన్నాడు.

అమరేంద్ర, ఆ కాగితంలో యేం రాసి వున్నదీ చదవలేదు. ఎంత త్వరగా అక్కణ్ణించి బైటపడితే అంత శ్రేయస్కరమనుకున్నాడు. సంతకం పెట్టి ఆ కాగితం అందించాడు వెంకటేశ్వరరావుకి.

"అమరేంద్రా, యిక్కడితో మన సంబంధాలు తెగిపోయినయ్ మరెప్పుడూ మా యింటికి రావద్దు, విడాకుల కోసం దరఖాస్తు పెట్టుకో, అయితే మేం నీకిచ్చిన కట్న కానుకలు తిరిగి ఇచ్చేయాలి.

అర్థమయ్యిందా?" అన్నాడు రాఘవ.

అర్థమైనట్టు తలూపాడు అమరేంద్ర. అతని నోట మాట పెగల్లేదు.

"నిన్ను కేసులో ఇరికించడానికి ఖచ్చితమైన ఆధారాలున్నా, యెటువంటి అపకారం తలపెట్టకుండా నిన్ను విడిచి పెడుతున్న మా సహృదయాన్ని, సంస్కారాన్ని అర్థం చేసుకొని,యికనైనా సత్‌ప్రవర్తనతో జీవితాన్ని సాగించడానికి ప్రయత్నించు. ఇక నీ దారి నీది వెళ్ళు..." కోపంతో అన్నాడు రాఘవ.

అమరేంద్ర యెవరివేపు చూడకుండానే, తన సూట్‌కేసు పట్టుకుని వూళ్ళోకి వెళ్ళిపోయాడు బతుకు జీవుడా అనుకుని

రాఘవ, వెంకటేశ్వరరావుకి, తన కృతజ్ఞతలు చెప్పుకుని రమతో పాటు విజయనగరం వెళ్ళిపోయాడు.

✪ ✪ ✪

రమ, యిప్పుడు స్వేచ్ఛ జీవి, అమరేంద్రను మళ్ళీ జీవితంలో యెప్పుడూ కలుసుకోదల్చలేదు. విడాకులు కూడా యివ్వదల్చలేదు, ఎందుకూఅంటే తాను విడాకులు యివ్వకుండా, అమరేంద్ర మరో వివాహం చేసుకోలేడు. కోర్టు ద్వారా విడాకులు సంపాదించడానికి అమరేంద్ర భయపడ్తాడు. ఎందుకూ అంటే తనని హత్య చేయ్యడానికి అతను ప్రయత్నించిన విషయం కోర్టులో చెబుతుందేమో ! అమరేంద్రకి భీతి వుంటుందని ఆమె వూహించింది. సాక్ష్యంగా అతను లిఖితపూర్వకంగా యిచ్చిన క్షమాపణపత్రం. అతనికి రమ వేసిన శిక్ష అదే !

□□□

(మందాకిని - నవంబర్ 94)